కథ

డా.సి.ఎం.అనూరాధ

# అంజలీ! నన్ను క్షమించు

"ఇలా అయితే నీవు నీ కూతురికి ఈ జన్మలో పెళ్ళి చేయలేవురా!" నా ఫ్రెండ్ సూర్యం నా మీద కోపంతో అలిగి వెళ్ళిపోయాడు. వాడు చెప్పింది నిజమేనేమో! కానీ ఏం చేయను? నాకిద్దరూ కూతుళ్ళే. ఇద్దరూ నా రెండు కళ్ళు. పెద్దమ్మాయి సౌమ్య బి.టెక్. పూర్తి చేసి ఓ ప్రైవేట్ కంపెనీలో జాబ్ చేస్తోంది. చిన్నమ్మాయి రమ్య మెడిసిన్ ఫస్టియర్. పెద్దమ్మాయికి ఈమధ్యనే ప్రపోజల్స్ చూస్తున్నాం. తన పెళ్ళి చేయాలంటేనే అమ్మాయి మాకు దూరమైపోతుందన్న భావనతో గుండె పిండేసినట్లవుతోంది. సూర్యం నా ప్రాణ స్నేహితుడు. సంబంధాలు తీసుకురావడం, డీటెయిల్స్ ఎంక్వైరీ చేయడం అన్నీ వాడే భుజాన వేసుకున్నాడు.

"సౌమ్యకు పెళ్ళి చేయాలనుకుంటున్నానురా" అని నేన్నదే ఆలస్యంగా వెతికి వెతికి మంచి సంబంధాలు ఎన్నో తీసుకొచ్చాడు. వాటిలో నేనేదీ ఒప్పుకోలేదు.

"ఎవరిని చూసినా ఏదో వంక పెడుతున్నావు కదరా" అంటాడు సూర్యం. మరి ఇన్ని రోజులూ గుండెలమీద పెట్టుకు పెంచిన కూతురిని ఒకరి చేతిలో పెట్టడమంటే మాటలా? ఎంత జాగ్రత్తగా వ్యవహరించాలి...? సూర్యం తెచ్చిన ప్రపోజల్స్‌లో ఏదీ నాకు పూర్తిగా నచ్చలేదు. ప్రతిదానిలో ఏదో ఒక లోపం వుంది.

సౌమ్యకు చూసిన మొట్టమొదటి సంబంధం కడప నుంచి వచ్చింది. అబ్బాయి చాలా బావున్నాడు. ఇన్ఫోసిస్‌లో మంచి పొజిషన్‌లో వున్నాడు. అతని పేరెంట్స్ ఎంతో మర్యాదస్తులు- అమ్మాయి మాకు నచ్చింది. కట్నం, కానుకలు ఏవీ అవసరం లేదన్నారు.

"ఇక ఆలోచించే అవసరమే లేదురా! మన సౌమ్య అదృష్టవంతురాలు. వెంటనే పెళ్ళిచూపులకు ఏర్పాటు చేద్దాం" అన్నాడు సూర్యం.

నా భార్య కూడా అదే విషయం రిపీట్ చేసింది. కానీ నేను ఒప్పుకోలేదు. ఎందుకంటే వాళ్ళు స్టేటస్‌లో నాతో సరితూగరు. నేనో పెద్ద బిజినెస్ మాగ్నెట్‌ని. అబ్బాయి

సూర్యం ఎంతో నచ్చచెప్పాడు- "ఏదో కారణాల వల్ల టెన్త్ సెకండ్ క్లాస్ పాసయ్యాడు. ఇందులో నీకొచ్చిన నష్టమేమిట్రా. తర్వాత అంతా షార్ప్‌గా ఉన్నాడు కదా! నా మాట విని ఒప్పుకోరా" అని.

సౌమ్య ప్రతి తరగతీ డిస్టింక్షన్‌లో పాసైంది. తనకు ఈ సంబంధం ఎలా మ్యాచ్ అవుతుంది అని వద్దన్నాను.

"ఒక మనిషి సంతోషంగా కాపురం చేయడానికి నీతీ, నిజాయితీ, ప్రేమ, అభిమానం ఇవి అవసరం కానీ టెన్త్ సెకండ్ క్లాసా, డిస్టింక్షనా అని కాదురా" అంటూ సూర్యం నన్ను మొహం వాచేలా తిట్టివెళ్ళాడు.

ఇక తిరుపతి సంబంధం విషయానికొస్తే అబ్బాయి టూ ఇంటెలిజెంట్ (సూర్యం ఆ విషయం నాకు నొక్కి మరీ చెప్పాడు) టూ స్మార్ట్ టు లుక్. ప్రిస్టీజియస్ జాబ్. తల్లిదండ్రులేమో రిటైర్డ్ టీచర్స్.

"ఆస్తేం చేసుకుంటావురా! అయినా నీకున్నది నీ కూతుళ్ళకీ చెందుతుంది కదరా! అది చాలదా వాళ్ళు బ్రతకడానికి. వాళ్ళ జాబ్స్ వాళ్ళకున్నాయి. ఒక్క విషయం ఆలోచించు. వాళ్ళు నీ ఆస్తి ఒక్క పైసా కూడా ఆశించడం లేదు. ఆ గొప్పతనమే వాళ్ళకు తరగని ఆస్తిరా! సౌమ్య ఆ కుటుంబంలో అయితే హాయిగా ప్రశాంతంగా వుంటుందిరా! నా మాట విను" సూర్యం బ్రతిమలాడాడు.

"ఈ సంబంధం వదులుకో వద్దండీ! వాళ్ళు సౌమ్యను ఇష్టపడ్డారు. తనకున్న ఆస్తిని కాదు. అలాంటి మంచి మనుషుల నీడలో సౌమ్య హ్యాపీగా వుంటుంది" నా భార్య అంజలి నచ్చచెప్పబోయింది.

నేను ససేమిరా అన్నాను.

రెండో సంబంధం విజయవాడ నుంచి తీసుకొచ్చాడు సూర్యం. ఈ అబ్బాయిదీ మంచి జాబ్. మంచి ఫ్యామిలీ. ఆస్తి అంతస్తుల్లో నాతో సరితూగ గలుగుతారు. కానీ ఈ అబ్బాయిలో నాకు నచ్చనిది అబ్బాయి కాస్త లావే అనిపిస్తాడు. అందాల భరిణ అయిన నా కూతురికి అతడెలా మ్యాచ్ అవుతాడు? అందుకే వద్దన్నాను.

ఇక రాజమండ్రి సంబంధంకొస్తే అబ్బాయి అందంగా వున్నాడు. మంచి జాబ్. వాళ్ళ అమ్మా, నాన్న సౌమ్యులు. ఆస్తీ అంతస్థులు బావున్నాయి. ఇక ప్రొసీడ్ అవుదామనుకొని అబ్బాయి బయోడేటా తిరగేస్తుంటే ఓ విషయం నాకు నచ్చలేదు. ఆ అబ్బాయి టెన్త్ సెకండ్ క్లాస్‌లో పాసయ్యాడు. మిగతా ఎడ్యుకేషన్ అంతా షార్ప్‌గానే ఉంది. టెన్త్ సెకండ్ క్లాస్‌లో పాసయిన వాడికి నా కూతుర్నెలా ఇస్తాను? వద్దన్నాను.

అన్నీ బావున్నాయి. కానీ ఆరాతీస్తే, ఆ అబ్బాయి మేనత్త వీళ్ళింట్లోనే ఉంటుందట. ఆమె చాలా గయ్యాళిట. నో..వే! ఒక ఏమీ ఆలోచించకుండా ఈ సంబంధమూ వద్దన్నాను.

"నీ కూతురేమైనా అక్కడే ఉంటుందా! ఆ అబ్బాయి జాబ్ చేసేది ఢిల్లీలో. ఏదో సంవత్సరానికి వారం రోజులు ఇక్కడికి వస్తారేమో. ఆ మాత్రానికి ఆమె గయ్యాళైతే నీకేమిరా? ఆ నాలుగు రోజులు సర్దుకుపోతే సరిపోతుంది. ఒరే! విష్ణు అబ్బాయి మంచివాడు. సౌమ్యుడుగా ఉండాలి అని ఆశించడంలో తప్పులేదు. కానీ అతని తల్లీ, తండ్రీ, బంధుగణం అందరూ మంచి వారుగా ఉండాలి. నాకు నచ్చాలీ అంటే ఇది జరిగే పనేనా! ఒక్కసారి ఆలోచించు" సూర్యం నెత్తీ నోరూ కొట్టుకొని బాధపడ్డాడు.

"ఇలా అన్ని సంబంధాలలో వంకలు పెడుతూ పోతే నీవూ, నీతోపాటు నీ కూతురు కూడా ముసలాళ్ళయిపోతారురా పెళ్ళి కుదరకనే" అంటూ నన్ను ఇష్టం వచ్చినట్లు తిట్టి వెళ్ళిపోయాడు సూర్యం.

నిదానమైనా సౌమ్యను అన్ని విధాల తగిన వాడి చేతిలో పెట్టాలని నా ఆశ. వాడేమో నీవు అనవసరంగా అన్నీ వంకపెడుతున్నావ్ అంటాడు.

ఒక్కోసారి ఆలోచిస్తుంటే పిచ్చి పట్టినట్లవుతోంది. పిల్లలను ఎంత ప్రేమగా పెంచుకున్నాడు తను. వాళ్ళే తన ప్రాణంగా బ్రతుకుతున్నాడు. పెళ్ళి పేరుతో వాళ్ళను పూర్తిగా ఒకరికి అప్పగించడమంటే మాటలా! అమ్మాయి పెళ్ళి అంటే తల్లిదండ్రులకు ఇంత టెన్షన్ వుంటుందా.

పిల్లలని ప్రేమగా పెంచి, కష్టపడి చదివించి, లక్షలు లక్షలు కట్నాలు కుమ్మరించి వాటితోపాటు మన గారాల

పట్టిని కూడా కాళ్ళు కడిగి మరీ వరుడి చేతిలో పెడతాం. అంతా చేసి అతడెలాంటివాడో అమ్మాయిని బాగా చూసుకుంటాడో లేదో అని భయం. కొందరు పైకి మంచిగా వుండి లోపల మోసగాళ్ళుగా ఉంటారు. ఇలాంటి ఆలోచనలు వస్తేనే పెళ్ళి వద్దు. ఏమీ వద్దు మన పాపను మన దగ్గరే పెట్టుకుందాం అనిపిస్తుంది. కానీ సమాజంలో నలుగురిలో పాటు నారాయణ అనక తప్పదు కదా!

"అంజలీ! కాస్త కాఫీ ఇవ్వు" నా భార్యను కేకేశాను. మరు నిమిషంలోనే కాఫీ కప్పుతో ప్రత్యక్షమయింది అంజలి.

"తలనొప్పిగా ఉందాండీ!" నా మనసుపడే సంఘర్షణను గుర్తించినట్లు నా నుదుట మీద చేయి వేసి అడిగింది. తన చేతి స్పర్శ ఎంతో చల్లగా, స్వాంతనగా అనిపిస్తోంది.

"కాసేపు చేయి అలాగే వుంచు అంజలీ హాయిగా వుంది"

తన చేతిపైన నా చేయి వేసి అన్నాను. నా గొంతు నాకే మార్దవంగా వినిపిస్తోంది. నమ్మలేనట్లు చూసింది అంజలి. ఆ చూపులకి సమాధానం చెప్పలేక తలవంచుకున్నాను నేను. నిజమే మరి! తనకు నమ్మకం ఎలా కుదురుతుంది. పెళ్లయి ఇన్నేళ్ళయినా ఏ రోజైనా తనతో ప్రేమగా, ఆప్యాయంగా మాట్లాడి ఉంటే కదా! ఎప్పుడూ కసురుకోవడమే.

అంజలి తన చేత్తో నా తల నిమురుతూ ఉంటే ఆ హాయిని ఆస్వాదిస్తూ మనసు ఒక్కసారి గతంలోకి వెళ్ళిపోయింది.


* * *

నా పెళ్ళి అంజలితో నిశ్చయమవగానే మా అమ్మ నన్ను హెచ్చరించింది. "ఇదిగో విష్ణూ నీవు పెళ్ళవగానే భార్యను అదుపులో పెట్టుకోవాలి. వెర్రి సుంకన్నలాగా దాని వెంట తిరుగుతున్నావనుకో, అది ఎప్పుడూ నిన్ను, నన్నూ లెక్కచేయదు. తనని ఎంతలో అంటే అంతలో ఉంచాలి" అని అమ్మ మాటలు నాపై బాగానే పనిచేశాయి. నాన్న నా చిన్నతనంలోనే చనిపోతే అన్నీ తానై నన్ను పెంచింది అమ్మ. తను చెప్పినట్లు వినడమేగాని అందులో ఉచితానుచితాలు ఆలోచించడం నాకలవాటు లేదు. తన మాటే నాకు వేదవాక్కు.

అమ్మ మాట ప్రకారమే నేను అంజలిని దూరంగా వుంచాను. అవసరమైతే తప్ప మాటలు లేదు. తనకు నా దగ్గర ఎలాంటి చనువు లేదు. అమ్మ కూడా తనతో అంటీముట్టనట్లుగా వుంటుంది. ఇప్పటికీ అంతే. అంజలి బాధపడడం నాకు తెలుసు. కానీ నేను మారదలుచుకోలేదు. అమ్మ మాట మీరదలుచుకోలేదు.

అంజలి వాళ్ళ పేరెంట్స్‌ను కూడా నేను, అమ్మా అలాగే ట్రీట్ చేసేవాళ్ళం. పెళ్ళాం తరఫు వాళ్ళను గౌరవించకూడదు అని అమ్మే చెప్పింది. నేను తూ.చ. తప్పకుండా ఆచరించేవాడిని. అంజలి తనని ఎలా ట్రీట్ చేసినా నిర్లిప్తంగా ఉండిపోయేది. కానీ తన పేరెంట్స్‌ని మేం మాట్లాడించకపోయినప్పుడు తను ఎంతో దెబ్బతిన్నట్లు చూసేది. ఆమె కళ్ళల్లో ఎంతో నిస్సహాయత, వ్యధ కనిపించేవి.

నెమ్మదిగా వాళ్ళు మా ఇంటికి రావడం మానేశారు. అప్పుడప్పుడూ అంజలి ఒంటరిగా వెళ్ళి వాళ్ళను కలిసి వచ్చేది. తను ఎంత రిక్వెస్ట్ చేసుకున్నా నేను వాళ్ళ ఊరికి పెళ్ళిలో తప్ప ఇంతవరకూ వెళ్ళలేదు. వాళ్ళ బంధువులంతా వాళ్ళింట్లో జరిగే శుభకార్యాలకు అంజలితో




పాటు నన్నూ, మా అమ్మను కూడా ఆహ్వానించేవాళ్ళు. కానీ మేమెప్పుడూ వాళ్ళ ఫంక్షన్స్‌కి వెళ్ళేవాళ్ళం కాదు. వాళ్ళ బంధువులంతా అంజలిని "ఏంటే! మీ వాళ్ళు ఎక్కడికీ రారు. మీ ఇంటికొస్తే ఎవరినీ పలకరించరు. మేమేమైనా తిండికోసం మీ ఇంటికొస్తామా! అభిమానం కొద్దీ వస్తే కనీసం పలకరించరు. మాట్లాడితే ఏమైనా కరిగిపోతారా!" అంటూ నిలదీయడం నా దృష్టిని దాటి పోలేదు.

* * *

అంజలి చేతి నుంచి నా శరీరంలోకి ప్రవహిస్తున్న ప్రేమ మనసును తాకి నా గుండెలో వేల విస్ఫోటనాలను కలిగిస్తోంది. నెమ్మది, నెమ్మదిగా నాకు అంజలిపట్ల నా ప్రవర్తన ఎంత అనుచితమో అర్థం కాసాగింది.

గతం అంతా గుర్తుచేసుకుంటుంటే నా మనసంతా ఓ విధమైన గిల్టీ ఫీలింగ్ ఆవరించసాగింది. నేను అంజలిని, ఆమె పేరెంట్స్‌ను ఇలా ఇల్‌ట్రీట్ చేశాను. రేపు ఇదే పరిస్థితి నా కూతురికి వస్తే. ఆ ఆలోచనే నాకు భయం కలిగిస్తోంది. పాపం! అంజలి ఇన్ని రోజులు మౌనంగా మమ్మల్ని భరించింది.

నేను పాపని ఎలా పెంచుకున్నానో అంజలి పేరెంట్స్ కూడా తనని అంత ప్రేమగానూ పెంచుకుని వుంటారు కదా! వాళ్ళు కూడా అన్నీ చూసి తమ కూతురు సుఖపడుతుందనే నాకిచ్చి కాళ్ళు కడిగి మరీ కన్యాదానం చేశారు. పాపం నా వల్ల వాళ్ళంతా ఎంత బాధపడి వుంటారు. ఇన్ని రోజులూ నా మనసు ఎందుకు అంజలి కోణం నుంచి ఆలోచించలేదు. నాకైనా ఇద్దరు కూతుళ్ళు. అంజలి వాళ్ళ పేరెంట్స్‌కి తనొక్కతే కూతురు. చదువులో సరస్వతి. ఎం.ఏ. లిట్‌లో యూనివర్సిటీలో టాప్ ర్యాంకర్. నేనూ, అమ్మ వద్దని వారించడం వల్ల తన చదువు అక్కడితో ఆగిపోయింది.






మనిషిని చూడగలం గానీ మనిషిలోపల మనసును చూడలేము గదా! నన్ను చూసిన వాళ్ళంతా ఏ దురలవాట్లూ లేవు. మంచి అబ్బాయి అనేవారు. అంజలి పేరెంట్స్ కూడా నా గురించి అలాగే అనుకొని మా సంబంధం కలుపుకున్నారు. నిజానికి అంజలి వాళ్ళ సంబంధం చాలా మంచిదని, వాళ్ళ తల్లిదండ్రులకు ఆ చుట్టుపక్కల చాలా మంచి పేరు ఉండడం వల్ల ఆర్థికంగా కూడా మా కంటే స్థితిమంతులు కావడం వల్లే మేమూ వెంటనే అంగీకరించాం. పెళ్లిలో కట్నకానుకల క్రింద నాకు భారీగానే సమర్పించుకున్నారు. అంజలి వాళ్ళ ఫాదర్ పేరు మోసిన డాక్టర్. ఆయన అంటే అందరికీ ఎంతో గౌరవం. అన్నీ తెలిసి కూడా నేనూ, అమ్మ ఆయన మా ఇంటికొస్తే పలకరించకుండా అవమానించేవాళ్ళం. అసలు ఆయన చేసిన తప్పేమిటి? ఆడపిల్లను కనడమే ఆయన చేసిన నేరమా?

ఇరవై ఏళ్ళ క్రితం అంజలి తండ్రి ఉన్న పొజిషనల్‌లోనే ఈరోజు నేనున్నాను. నా కూతురికి పెళ్ళి సంబంధాలు వెదుకుతూ, అంజలి తండ్రికి ఎదురైన సంఘటనలే నా కూతురు చేసుకోబోయే వ్యక్తి ద్వారా నాకెదురైతే, ఆ ఆలోచనకే ఒళ్ళు గగుర్పొడుస్తోంది. "భగవంతుడా! నేను చేసిన తప్పునకు నా కూతురికి శిక్ష వేయకు" దేవుని మనస్ఫూర్తిగా మొక్కుకున్నాను.

"అంజలీ! నన్ను క్షమించు" ఆర్తిగా తన రెండు చేతులూ పట్టుకున్నాను. నా మనసులోని సంఘర్షణ అంజలికి అర్థమయినట్లుంది. ఓదార్పుగా నాకేసి చూసింది. మీరేం భయపడకండి. సౌమ్యకు అన్ని విధాలా తగిన సంబంధమే కుదురుతుంది. మీరేమనుకోకపోతే ఆ కడప సంబంధం ఓకే చేద్దాం. సౌమ్యకు అన్ని విధాలా తగిన సంబంధం అది" అంజలి మాటలకు మౌనంగా తలూపాను. వెంటనే ఫోన్ తీసుకుని సూర్యంకు చెప్పాను. "కడప సంబంధం ఓకే చేయమని" ఇప్పుడు నా మనస్సెంతో రిలాక్స్‌డ్‌గా నిశ్చింతగా వుంది.

## టాబు నిర్ణయం!

అదేంటోగానీ హైదరాబాదు అమ్మాయి అయివుండీ టాబుకి తెలుగు సినీ రంగం మాత్రం కలిసిరావడం లేదు. మొదట తెలుగులోనే చిత్రరంగ ప్రవేశం చేసిన టాబుకి ఆ తర్వాత బాలీవుడ్‌లోనే గుర్తింపు వచ్చింది. ఈమధ్య పాండురంగడు, ఇదీసంగతి సినిమాల్లో నటించడం వల్ల టాబుకి గుర్తింపు మాట అటుంచి మైనస్ మార్కులే ఎక్కువ పడ్డాయి. అందువల్లనేమో ఇక టాలీవుడ్‌లో నటించకూడదనే నిర్ణయానికి వచ్చిందని అంటున్నారు. ఎలాగూ బాలీవుడ్‌లో అడపాదడపా ఆఫర్లు వస్తూనేవున్నాయి కదా!